క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

పెనుగంచిప్రోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్‌ఐ పి. రాంబాబు తెలిపారు. శాంతిభద్రతలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని నవాబుపేట, వెంగనాయకుని పాలెం గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు.

మహిళా ప్రజాప్రతినిధులకు ఘనసత్కారం

పెనుగంచిప్రోలు: మంచి సమాజం మహిళలతోనే సాధ్యమని సర్పంచి పద్మకుమారి, జెడ్పీటీసీ వూట్ల నాగమణి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కేడీసీసీ బ్యాంక్‌లో మహిళా బ్యాంక్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఖాతాదారులను గురువారం సన్మానించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.దుర్గాప్రసాద్, మేనేజర్ ఆర్.రజనీకాంత్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, మాజీ అధ్యక్షురాలు బొమ్మి రాణి పాల్గొన్నారు.

'కొహైన్స్'లో ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కొహైన్స్ లైఫ్ సైన్స్ లిమిటెడ్ కర్మాగారంలో గురువారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కర్మాగారం ప్రాంగణంలో పెద్ద ప్రమాదాలు జరిగిన సమయంలో కార్మికులు, సిబ్బంది అత్యవసర పరిస్థితిలో ప్రమాదాల నుంచి బయటపడే దృశ్యాలను ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. దాదాపు రెండు గంటలపాటు డ్రిల్ నిర్వహించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ జానకిరామ్, ఎస్‌ఐ సతీష్, ఫైర్ అధికారి నాగరాజు, కర్మాగారం ప్రెసిడెంట్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.46కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు

నందిగామ: మున్సిపాలిటీ పరిధిలో 2024–25 సంవత్సరానికి సంబంధించి నందిగామ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి అధ్యక్షతన గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఓర్సు లక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.45.98కోట్లతో బడ్జెట్ అంచనాలను రూపొందించినట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ పాకాలపాటి కృష్ణ, కమిషనర్ హేమమాలిని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలు విజయవంతం అయ్యేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నందిగామ ఆర్డీవో రవీంద్రరావు సూచించారు. ఈనెల 25వతేదీ నుంచి 29వతేదీ వరకు జరిగే తిరునాళ్ల ఉత్సవాల నిర్వహణపై ఆయాశాఖల అధికారులతో ఆలయ సత్రాల్లో గురువారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్ నాయుడు ఎస్‌ఐ పి.రాంబాబు, తహసీల్దార్ వి.అమ్మాజీ, ఎంపీడీవో ఎస్‌వీ సాయిహర్ష ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు, పీఆర్ డీఈ కిరణ్, ఏఈ సుందరరామయ్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



శివరాత్రికి ముస్తాబైన ముక్త్యాల ఆలయం



విద్యుద్దీపాలంకరణలో సంగమేశ్వరుడి ఆలయం

- నేడు ముక్తేశ్వరస్వామి కల్యాణం
- కూడలి తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్నట్లు భక్తులు

జగ్గయ్యపేట, నందిగామ: మహాశివరాత్రి పండుగకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ముక్త్యాల్లోని భవానీ ముక్తేశ్వరస్వామి, నందిగామ మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరుడి ఆలయాలు, కోటిలింగాల అమృత లింగేశ్వరుడి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కూడలి, ముక్త్యాలల్లో స్వామివార్ల కల్యాణోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

వెలుగులీనుతున్న ఆలయాలు..

కృష్ణానదిలో పుణ్యస్నానాలతోపాటు ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు లక్షమందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయం, కృష్ణానది ఘాట్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముక్తేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి 12.00 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో జయప్రకాష్‌బాబు తెలిపారు.

పులిచింతల నుంచి నీరు విడుదల...

కృష్ణానదిలో నీరు తక్కువ ఉండటంతో జలవనరులశాఖ అధికారులు పులిచింతల ప్రాజెక్టు నుంచి 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అదేవిధంగా స్నానఘాట్‌ల వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, పడవలు ఏర్పాటు చేశారు.

కోటిలింగాల ముస్తాబు..

మహాశివరాత్రి ఉత్సవాలకు పంచముఖ అమృత లింగేశ్వర కోటిలింగ హరిహర మహాక్షేత్రం ముస్తాబైంది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈవో రవిబాబు ఏర్పాట్లు చేశారు. బాణ వాయు శివలింగ ప్రతిష్ఠలకు సైతం అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా 200 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ జానకిరామ్ తెలిపారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మహాశివరాత్రి పండుగకు మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పెనుగంచిప్రోలులో గురువారం నిర్వహించే శివకల్యాణానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మహాశివరాత్రి పండుగకు కంచికచర్ల మండలంలోని శివాలయాలను భక్తులు విద్యుద్దీపాలంకరణలతో అలంకరించారు. కంచికచర్ల మండలంలో నేషనల్ హైవే సమీపంలో శ్రీశివసాయి క్షేత్రంతో పాటు మోగులూరు, మున్నలూరు, పెండ్యాల, చెవిటికల్లు, పరిటాల, కునికెనపాడు, గొట్టుముక్కల, కీసర తదితర గ్రామాల్లోని శివాలయాలన్నీ శివరాత్రి పండుగకు ముస్తాబయ్యాయి

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మహాశివరాత్రి పర్వదినానికి వీరులపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని జుజ్జూరులో వేంచేసియున్న సోమేశ్వరస్వామివారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, పక్కన పేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

ఎంపీ కేశినేని నాని

జగ్గయ్యపేట అర్బన్: రానున్న ఎన్నికల యుద్ధానికి బూత్ కమిటీల సభ్యులు సిద్ధంగా ఉండాలని ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పిలుపునిచ్చారు. స్థానిక శాంతినగర్‌లోని బి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం 'మేం సిద్ధం–మా బూత్ సిద్ధం' సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయా సంక్షేమ పథకాల కింద రాష్ట్రప్రజలకు రూ.2.56లక్షల కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమచేశారన్నారు. ముఖ్యమంత్రిగా ఇంతలా ప్రజాసంక్షేమం కోసం లక్షలాది కోట్లను ఖర్చుచేసిన మొనగాడు దేశంలోనే మరెవ్వరూ లేరని పేర్కొన్నారు. 2019 నుంచి సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని నిరూపించేందుకు తాను చర్చకు సిద్ధమని, 2014–19 మధ్య రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు చంద్రబాబు సిద్ధమా? అని సవాల్ విసిరారు. సీఎం జగన్ తన పాలనలో రాష్ట్రంలో 11వేల గ్రామ, వార్డు సచివాలయాలు, 13వేల రైతుభరోసా కేంద్రాలకు సొంతభవనాలు నిర్మించారన్నారు. సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేల కోసం అక్షరాల రూ.30 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు.రూ.18 వేల కోట్లతో 17 మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేశారని, ఇంకా షిప్ యార్డులు, హార్బర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 31లక్షల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు తనస్వార్థం కోసం వేలాది మంది రైతులను మోసం చేశారని విమర్శించారు. జగ్గయ్యపేట అభివృద్ధి ఎమ్మెల్యే ఉదయభాను తోనే సాధ్యమైందన్నారు. జగ్గయ్యపేట, నందిగామ టీడీపీ అభ్యర్థులు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య నోరువిప్పిమాట్లాడలేని అసమర్థులని..అటువంటి వారికి ఓటువేసి ఓటును దుర్వినియోగం చేసుకోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. 24అసెంబ్లీ సీట్ల కోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జనసైనికుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు, లోకేష్ వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. ముస్లింమైనార్టీలను మోసం చేయడానికి చంద్రబాబు, బీజేపీతో పొత్తుకు పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ పేట పట్టణంతోపాటు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి అంతా తాము చేసిందేనన్నారు. 2008లో తాను శంకుస్థాపన చేసిన ఉక్కు కళావేదిక, టీటీడీ కల్యాణ మండపాలను పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న శ్రీరాం తాతయ్య పట్టించుకోకపోతే 2019లో తాను తిరిగి ఎమ్మెల్యే అయిన తర్వాత వాటి నిర్మాణం, అభివృద్ధిని చేపట్టానని గుర్తుచేశారు. తాను పలుమార్లు ఢిల్లీ వెళ్లి రైల్వే డబ్లింగ్ లైన్ కోసం రూ.1450కోట్లు మంజూరు చేయించానని, త్వరలోనే పేటకు ప్యాసింజర్ రైలు వస్తుందని వివరించారు. ముక్త్యాల వద్ద కృష్ణానదిపై రూ.60 కోట్లతో బ్రిడ్జికి శంఖుస్థాపన చేశామన్నారు. రూ.3కోట్లతో ఊరచెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, రూ.1కోటితో హైవే బస్టాండ్, రూ.3.50 కోట్లతో టీటీడీ కల్యాణమండపం నిర్మిస్తున్నామన్నారు. వందలాది కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన వైనాన్ని వివరించారు. ప్రతి బూత్ కమిటీ సభ్యుడు ఇంటింటికీ వెళ్లి సీఎం జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



కంభంపాడులో సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ నాని, విప్ ఉదయభాను

కంభంపాడు,(వత్సవాయి) : పేదప్రజలకు వరంలా మారిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) కొనియాడారు. మండలంలోని కంభంపాడులో రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.25 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.20లక్షలతో చేపట్టిన డ్రైయిన్లు, మంగోలు గ్రామంలో రూ. 43లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, మక్కపేటలో రూ.36 లక్షలతో నిర్మించిన సొసైటీ భవనం, ప్రహరీలను గురువారం వారు ప్రారంభించారు. మక్కపేటలో రూ.22లక్షలతో నిర్మించిన సొసైటీ నూతన గొడౌన్‌తోపాటు క్యాష్‌కౌంటర్‌ను కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాని, విప్ ఉదయభాను మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని చెప్పి ఓటు అడిగే హక్కు ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్,, కంభంపాడు సర్పంచి బేతపుడి పున్నమ్మ,, ఎంపీటీసీ కల్యాణి, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నాయకులు సరాల మధుసూదనరెడ్డి, వెంకటరెడ్డి, మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్, పోలంపల్లి సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, మంగొల్లు సర్పంచి అన్నెపాక ప్రణీత, ఎంపీటీసీ గోసు రత్నకుమారి, మక్కపేట ఎంపీటీసీ ఆళ్ల కుమారి, సొసైటీ అధ్యక్షులు కొండబోలు వెంకటబ్రహ్మం, సామినేని లక్ష్మీనారాయణ, కనగాల రమేష్ పాల్గొన్నారు.

'అయ్యంకి'కి ఘననివాళి



కంచికచర్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పాలకుడు అల్లూరి రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీనివాస్‌శర్మ స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఇద్దరికి స్వల్పగాయాలు

కంచికచర్ల : యనమలకుదురుకు చెందిన ఎస్‌వీబి సత్యనారాయణ అనేవ్యక్తి తన భార్యతో కలసి కారులో గురువారం హైదరాబాద్ వెళ్తుండగా, కంచికచర్ల సమీపంలో ప్రమాదవశాత్తు వారి కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వారిద్దరికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సుబ్రమణ్యం బాధితులను స్థానిక వైద్యశాలకు తరలించారు.

ఎలుకల మందు తాగి యువకుడి మృతి

కంచికచర్ల : తనతండ్రి, సోదరుడు రెండేళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక కీసర యలమంచిలి కోల్డ్‌స్టోరేజ్‌లో స్టోర్‌ఇన్‌చార్జిగా పనిచేస్తున్న చిత్తూరుజిల్లా పులిచర్ల మండలం రెడ్డివారిపాలెంకు చెందిన నాన బాల గోపీచంద్(28) బుధవారం ఎలుకల మందుతాగాడు. కోల్డ్‌స్టోరేజీ సిబ్బంది అతన్ని వెంటనే విజయవాడ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుబ్రమణ్యం తెలిపారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకటాచలం మృతి



జగ్గయ్యపేట అర్బన్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జగ్గయ్యపేట మున్సిపల్ మాజీచైర్మన్ ముత్యాల వెంకటాచలం(56) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటాచలం మృతి చెందారన్న వార్తను తెలియగానే ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బి.కన్వెన్షన్‌లో సమావేశంలో ఉండగా వెంకటాచలం మృతి వార్త తెలియడంతో ఎమ్మెల్యేతోపాటు ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్‌సీపీ నాయకులు కొద్దిసేపు మౌనం పాటించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

సర్దార్ సామినేని విశ్వనాథంకు ఘననివాళి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ మాజీ సర్పంచి సర్దార్ సామినేని విశ్వనాథం సప్తమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని విశ్వనాథం కాంస్య విగ్రహానికి ఎంపీ కేశినేని నాని, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27 గ్రామాలకు ట్యాంకర్ల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ లోక్‌సభస్థానం పరిధిలోని జగ్గయ్యపేట నియోజకవర్గంలో రాబోయే వేసవి ఎద్దడిని ఎదుర్కొని, అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు 27మంచినీటి ట్యాంకర్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీ కేశినేని నాని తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డులో గురువారం ఆయన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి 5వేల లీటర్ల సామర్థ్యంగల ఒక్కొక్కటి రూ.2.50లక్షల విలువగల 27మంచినీటి ట్యాంకర్లను ఆయా పంచాయతీలకు పంపిణీ చేశారు.

ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలి..

ఈసందర్భంగా చంద్రబాబు ఢిల్లీ పర్యటన, బీజేపీ పొత్తులపై మీడియా ప్రశ్నలకు ఎంపీ కేశినేని నాని స్పందించారు. ప్రధాని మోడీపై తనచే అవిశ్వాస తీర్మానం పెట్టించి, ప్రత్యేక ప్యాకేజీ వద్దని యూటర్న్ తీసుకున్న వ్యక్తి చంద్రబాబు అని గుర్తుచేశారు. ధర్మపోరాట దీక్ష పేరుతో కుటుంబంలేదని మోడీని అవమానించారన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు కోసం అపాయింట్‌మెంట్ లేకపోయినా రాహుల్ గాంధీ ఇంటికి వెళ్లిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. మోడీ చూపు ఉంటే చాలని, పార్టీని బీజేపీలో కలిపే ప్రయత్నమే చంద్రబాబు ఢిల్లీయాత్రకు కారణమన్నారు. రాజధాని నిర్మాణం, స్టీల్‌ప్లాంటు అమ్మకం నిలుపుదల, ప్రత్యేకహోదాపై ఏమి హామీ వచ్చిందని.. బీజేపీతో టీడీపీ పొత్తుపెట్టుకుంటుందో టీడీపీ అధినేత ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మోడీకి వ్యతిరేకంగా మైనార్టీ సభలు పెట్టిన చంద్రబాబు ఈరోజు ఏం సమాధానం చెపుతారని నిలదీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు తుమ్మల ప్రభాకర్, హాఫీజున్నీసా ఫిరోజ్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, వైస్ చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ఏఎంసీ డైరెక్టర్లు సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ సొసైటీ కార్యాలయం ప్రారంభం



చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడులో కేడీసీసీ బ్యాంకు నిధులు రూ.36లక్షలతో నిర్మించిన సొసైటీ కార్యాలయం, పాటెంపాడులో ఎన్‌ఆర్‌యుఎం నిధులు రూ. 40లక్షలతో నిర్మించిన సొసైటీ గోడౌన్ నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి గురువారం ప్రారంభించారు. చందర్లపాడులో రూ.17.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం జలకళ పథకం కింద 11మంది రైతులకు రూ. తొమ్మిది లక్షల విలువ చేసే విద్యుత్ మీటర్లు, సామాగ్రిని పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, సర్పంచి కస్తాల పున్నమ్మ, సొసైటీ చైర్మన్ రాయల జానకిరామయ్య, నాయకులు శాఖమూరు వెంకట కుమారి, కె. నర్సిరెడ్డి, వైఎస్‌ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

■ చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం : ఎంపీ నాని

నందిగామ టౌన్: శాశ్వత సచివాలయం కూడా కట్టలేని టీడీపీ అధినేత చంద్రబాబు, తమ హయాంలో అభివృద్ధి చేశామనడం హాస్యాస్పదంగా ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. నందిగామలో గురువారం 100 పడకల ఆస్పత్రి శంకుస్థాపన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చంద్రబాబు చేసిన దానికంటే మూడురెట్లు అభివృద్ధి చేసి చూపించారన్నారు.కోట్ల విలువచేసే స్థలాన్ని ప్రభుత్వాస్పత్రికి అందించేలా రైతులను ఒప్పించిన నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు వంటి సమర్థులను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఉన్నారు.

■ చట్టాలపై మహిళలకు అవగాహన



జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మెప్మా కార్యాలయంలో లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మెప్మా సిబ్బందికి మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కాంతారావు, ఏజీపీ టీఎల్.నరసింహారావు, ఆంజనేయులు, విజయకుమారి, డి.నాగేశ్వరరావు, శోభాతోరణి, మెప్మా ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక విజ్ఞాన్ హైస్కూల్, వాగ్దేవి మహిళా కళాశాల తదితర విద్యాసంస్థల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తన్నీరు సుధారాణి, ప్రిన్సిపాల్ బుస్సా సురేష్ పాల్గొన్నారు.

గండ్రాయిలో..

గండ్రాయి(జగ్గయ్యపేట): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గండ్రాయిలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్‌వాడీలు, ఆయాలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలను సత్కరించారు. ఉపాధ్యాయులు సైదులు, రామారావు, సుబ్బారావు, జ్యోతికుమారి, నేలవెల్లి రమేష్ బాబు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల : స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలను ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, బండారుపల్లి నాగపుష్పలీల, కంచర్ల పద్మావతి, ముత్యాల రోజారమణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. పరిటాల అమ్రితసాయి, కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.శశిధర్, డాక్టర్ టీ వంశీకిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వత్సవాయిలో..

వత్సవాయి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్టేషన్ ఆవరణలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. ఎస్‌ఐ అభిమన్యు, వత్సవాయి సర్పంచి భూక్యా సీతమ్మ, గోపినేనిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా వైఎస్సార్ చేయూత పంపిణీ

నందిగామ టౌన్: పట్టణ సమీపంలోని ఆర్‌ఎస్ గార్డెన్స్‌లో గురువారం వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నందిగామ పట్టణ, మండలంలోని మహిళలకు వైఎస్సార్ చేయూత నమూనా చెక్కును ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ నందిగామ పట్టణ, మండలంలోని 3023మంది మహిళలకు చేయూత పథకం కింద రూ.5.66కోట్లు అందిస్తున్నట్లు వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను ఘనంగా సత్కరించారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, కమిషనర్ హేమమాలిని, ఎంపీపీ ఆకుల రంగా, నెలకుదిటి శివనాగేశ్వరరావు, సూరా కొండ, స్టాలిన్, జ్వాలా, మహిళలు పాల్గొన్నారు.